మహనీయుడు జగ్జీవన్ రామ్

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి దళిత, ప్రజాసంఘాలు, పలుపార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. దేశంలోని నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఆదర్శ నాయకుడు అని, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్


మహబూబాబాద్ అర్బన్: జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


తొర్రూరు రూరల్: నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, నాయకులు


డోర్నకల్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు


గార్లలో..


నెహ్రూసెంటర్: నివాళులర్పిస్తున్న సోమయ్య


తొర్రూరు: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


గూడూరు: ఎంపీడీఓ కార్యాలయంలో..


మరిపెడలో..


కేసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో..


దంతాలపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు


నెల్లికుదురు: నివాళులర్పిస్తున్న ఉపాధి కూలీలు..

క్లుప్తంగా

'మోడల్' పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

డోర్నకల్: చిలుకోడు శివారు మోడల్ స్కూల్‌లో ఆదివారం జరిగే అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణభాను తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 7న ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పోలీసులకు సన్మానం



కేసముద్రం: కేసముద్రం పోలీస్‌స్టేషన్ ఏఎస్సై కృష్ణమూర్తి, హెడ్‌కానిస్టేబుల్ రమేష్ ఇటీవల రాష్ట్రస్థాయిలో పతకాలను అందుకున్నారు. ఈమేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్‌లను రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై వంశీధర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ తమ వృత్తిపై అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

ఇఫ్తార్ విందు



గార్ల: మండలంలోని మద్దివంచ గ్రామంలో ముస్లిం సోదరులకు పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ శుక్రవారం ఇఫ్తార్‌విందు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఆడెపు వెంకటేశ్వర్లు, హతీరాం, సంజీవరెడ్డి, ముస్లింలు నయీమ్, అజిత్, మైబల్లి, రషీద్ పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మదన్



నెల్లికుదురు: బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని రత్తిరాం తండాకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు గుగులోతు మదన్ నియామకం అయ్యారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మరిపెడ రూరల్: వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడికి చర్యలు చేపట్టినట్లు మండలంలోని వీరారం ఇన్‌చార్జ్ కార్యదర్శి నూతక్కి రామకృష్ణ తెలిపారు. మండలంలోని వీరారం గ్రామ పంచాయతీ పరిధిలోని అర్కావత్‌తండాలో కొద్దిరోజులుగా నీటి సరఫరా కావడం లేదు. దీంతో స్థానిక గ్రామ కార్యదర్శి స్పందించి ఓ ప్రైవేట్ బోర్‌ను కిరాయికి తీసుకుని తండా వాసులకు మంచినీటి సౌకర్యాన్ని శుక్రవారం కల్పించారు.

అవార్డు ప్రదానం



నెల్లికుదురు: మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన సింగర్ బాసంపల్లి నరేష్ బెస్ట్ సింగర్ నేషనల్ అవార్డు అందుకున్నాడు. ఈనెల 4న హైదరాబాద్‌లోని బిర్లామందిర్ ఆడిటోరియంలో జరిగిన గద్దర్ యాది సభలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని నటుడు ప్రొడ్యూసర్ అంబిక కృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు నరేష్ తెలిపాడు.

క్రీడలతో ఆరోగ్యం

తొర్రూరు: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని విద్యాశాఖ ఎంఎన్‌ఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంప్లాయీస్ వాలీబాల్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం చేపట్టారు. వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, టీషర్టులు అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గౌడిశాల నగేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఎన్‌ఓ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి ఫణీంద్ర, ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, వెంకన్న, మధుకర్ పాల్గొన్నారు.

హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి


మాట్లాడుతున్న రామచంద్రరావు

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రామచంద్రరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళీ అధ్యక్షతన ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల ఆత్మహత్యలను అడ్డుకోవాలని కేంద్ర ప్రభుత్వం రామగుండంలోని రూ.125కోట్లతో ఎరువుల ఫ్యాక్టరీని పునఃప్రారంభించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు రూ.2లక్షలు రుణమాఫీని మరిచిపోయిందని, రూ.15వేలు రైతుబంధు, కౌలు రైతులకు రూ.12వేలు అమలు చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలతో దేశంలో మూడోసారి మోదీ ప్రధాని అవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శశివర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఇందూ భారతి, ఉపాధ్యక్షుడు కృష్ణ, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పద్మ, రేష్మా, రాజేష్, రాజు, నరేష్, హుస్సేన్ నాయక్ పాల్గొన్నారు.

బలరాంనాయక్‌ను మెజార్టీతో గెలిపించాలి


మాట్లాడుతున్న రాములు నాయక్

మరిపెడ: తెలంగాణలో ఉన్న 17 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పార్టీ నియంత పాలన చేపట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే అది బీజేపీ ఖాతాలో పడుతుందన్నారు. కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు బొమ్మరగాని శంకర్‌గౌడ్, భీముడు నాయక్, తాజుద్దీన్, కోట వెంకట్‌రెడ్డి, రాంలాల్, అంబరీష, అప్సర్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- ఎమ్మెల్యే మురళీనాయక్


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

కేసముద్రం: హిందూ, ముస్లింలు సోదరభావంతో మెదలాలని ఎమ్మెల్యే భుక్యా మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని మసీద్‌లో నవజవాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ భుక్యా ఉమా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యులు గుగులోతు దస్రూనాయక్, బండారు వెంకన్న, ఎండి.అయూబ్‌ఖాన్, తేరాల భద్రం, దయాకర్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్‌అలీ, రజాక్, తాజుద్దిన్, రియాజ్ పాల్గొన్నారు.

మైనింగ్ దందా..!

- బెరైటీస్ ఖనిజం అక్రమంగా తరలింపు
- పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు


బెరైటీస్ ఖనిజ నిల్వలను చూపిస్తున్న నాయకులు (ఫైల్)

గార్ల: మండలంలోని సేరిపురం, పోచారం పంచాయతీల్లో గతంలో ప్రభుత్వ అనుమతులతో కొనసాగి, 12 ఏళ్ల క్రితం మూతపడ్డ బెరైటీస్ మైనింగ్ గుట్టల ప్రాంతం నుంచి కొంతమంది వారం రోజుల క్రితం ట్రాక్టర్ల ద్వారా నిల్వ ఉన్న ఖనిజాన్ని అక్రమంగా ఎత్తుకెళ్లారు. బెరైటీస్ ఖనిజాన్ని ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నా, సంబంధిత శాఖల అధికారులు ఖనిజ అక్రమ రవాణాను అరికట్టడంలో వైఫల్యం చెందారని ఈ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్క లారీ బెరైటీస్ ఖనిజం అమ్మితే సుమారు రూ.4లక్షలు లాభం వస్తుందని గతంలో మైనింగ్ నడిపిన వ్యక్తులు పేర్కొన్నారు. గతంలో ఈ పంచాయతీల్లో విశ్వభారతి, శ్రీలక్ష్మి, కనుకదుర్గ తదితర కంపెనీ పేర్ల మీద బెరైటీస్ ఖనిజం మైనింగ్‌లు ప్రభుత్వ అనుమతితో లీజ్ పొంది బెరైటీస్ మైనింగ్ తవ్వకాలు నడిచేవి. హైకోర్టు ఆదేశాల మేరకు ఇండియన్ ఫారెస్ట్ సర్వే టీం అప్పట్లో ఈ ప్రాంతానికి వచ్చి వారంరోజుల పాటు సర్వే జరిపి మైనింగ్ ప్రాంతమంతా రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉందని తేల్చడంతో నాడు హైకోర్టు ఈ ప్రాంత బెరైటీస్ మైనింగ్ సంస్థలన్నింటి లీజ్‌లను రద్దు చేసింది. నాటి నుంచి ఈ ప్రాంతమంతా అటవీశాఖ అధికారుల ఆధీనంలోకి వెళ్లింది. బెరైటీస్ ఖనిజాన్ని ఖమ్మం, జగ్గయ్యపేట, కడపకు తరలిస్తూ మైనింగ్ మాఫియా లక్షల్లో దోచుకుంటున్నారు. అడ్డుకున్న గ్రామస్తులను సైతం మైనింగ్ మాఫియా గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అటవీ, మైనింగ్ అధికారులు స్పందించి మైనింగ్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇట్టి బెరైటీస్ ఖనిజ అక్రమ రవాణాపై ఫారెస్ట్ డీఆర్‌ఓ రమేష్‌ను సాక్షి వివరణ కోరగా నాలుగు నెలల క్రితం బెరైటీస్ ఖనిజాన్ని కొందరు వ్యక్తులు ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా పట్టుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. ఖనిజం తరలికుండా రాత్రి సమయాల్లో సైతం నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

విధులకు ఆటంకం.. ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: తన విధులకు ఆటంకం కలిగించారని ప్రభుత్వ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకరిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ సీఐ పి.సర్వయ్య శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అటవీశాఖ బీట్ ఆఫీసర్లు గుగులోత్ అనిల్, అందె వీరన్న, బానోత్ పుష్ప మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర స్వామివారి దేవాలయ సమీపంలో గురువారం రాత్రి విధులు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా అటవీశాఖ బీట్ ఆఫీసర్లు ఆ ఇసుక ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారని డ్రైవర్ గుగులోత్ నగేష్ అడుగగా.. బీట్ ఆఫీసర్ గుగులోత్ అనిల్ పై దాడి చేశాడు. అదే విధంగా మరో ఇద్దరు బీట్ ఆఫీసర్లు వీరన్న, పుష్పతో వాగ్వాదానికి దిగాడు. దీంతో ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించారని బీట్ ఆఫీసర్ అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మరిపెడ: ఒంటరిగా ఉంటున్న తనపై అన్యాయంగా దాడి చేసి ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం కాలనీకి చెందిన ఒంటరి మహిళ మండల భాగ్యమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంది. ఈసందర్భంగా శుక్రవారం మరిపెడ పీహెచ్‌సీలో వైద్యం తీసుకుంటు తన ఆవేదనను విలేకరుల ఎదుట వెల్లబోసుకుంది. తన ఇంటి సమీపంలో ఉంటున్న బెస్త ఆదాం, కళావతి కొద్ది రోజులుగా తనను అనుమానిస్తూ మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో శుక్రవారం ఆకిలి ఊడుస్తుండగా వారి అనుచరులతో వచ్చి రాళ్ల దాడి చేసి, కాళ్లతో తన్నారని కన్నీటి పర్యంతమైంది. వారి దాడితో భయాందోళనకు గురైన తాను ఆత్మరక్షణ కోసం మరిపెడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని బాధితురాలు ప్రభుత్వాన్ని వేడుకుంటుంది.

'లబ్ధి పొందిన వారే పార్టీ మారుతున్నారు..'

డోర్నకల్: బీఆర్‌ఎస్ నుంచి అన్నివిధాల లబ్ధి పొందిన అవకాశవాదులే పార్టీ మారుతున్నారని మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కత్తెరసాల విద్యాసాగర్ అన్నారు. డోర్నకల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్మన్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సత్తిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ సహకారంతో అనేక పదువులు, కాంట్రాక్ట్ పనులు పొందారని తెలిపారు. బీఆర్‌ఎస్ కష్టకాలంలో ఉన్న సమయంలో అవకాశవాద రాజకీయంతో పార్టీకి వెన్నుపోటు పొడిచి బయటకు వెళ్లారని తెలిపారు. ప్రజలు వారికి సరైన సమయంలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ సంధ్యారాణి, జనార్దన్, నాయకులు వీరన్న, యశోధర్‌జైన్, మధు, గౌస్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు



పెద్దవంగర: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఎంతో తోడ్పడతాయని వైస్ ఎంపీపీ బొమ్మెర బోయిన కల్పన అన్నారు. శుక్రవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో జనవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ సల్దెండి మంజులతో కలిసి ఆమె ప్రారంభించారు. మైలపాటి సులోచన దేవి తన భర్త జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటుకు సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనవికాస కోఆర్డినేటర్ శైలజ, శోభరాణి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

వాహన రాయితీని కొనసాగించాలి

మరిపెడ రూరల్: గిరిజనుల వాహన రాయితీని యథావిధిగా కొనసాగించాలని జాతీయ బంజార మిషన్ ఇండియా (ఎన్‌బీఎంఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బానోతు రమేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈమేరకు మండలంలోని బాల్యతండాలో శుక్రవారం రమేష్‌నాయక్ మాట్లాడారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, ఉపాధి కల్పన దృష్టిలో పెట్టుకొని వాహనాలపై రాయితీ మహిళలకు 45శాతం, పురుషులకు 35శాతం అందించిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఈ స్కీంను ఏప్రిల్ నుంచి పరిశ్రమల శాఖ ద్వారా కాకుండా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా పొందాలని ఉత్తర్వులు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పాత పద్ధతిలో కొనసాగించే వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని రమేష్‌నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

హనుమనాయక్ ఆశయాలను కొనసాగిస్తాం

మహబూబాబాద్ రూరల్: సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ హనుమనాయక్ ఆశయాలను కొనసాగిస్తామని సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ జాతీయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు నాయక్ అన్నారు. బానోత్ హనుమానాయక్ హఠాన్మరణం చెందగా శుక్రవారం ఎమ్మెల్యే మురళీనాయక్ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న, జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్, జాతీయ కోర్ కమిటీ సభ్యులు ధరావత్ మోతీలాల్, జిల్లా అధికార ప్రతినిధులు మాలోత్ సురేష్, జరుపుల బాలు, లింగన్న పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు ఖాయం'


సమావేశంలో మాట్లాడుతున్న సీతారాంనాయక్

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని, గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ నాయకులు కృషి చేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంద కొమురమ్మనగర్‌లో ఎమ్మార్పీఎస్ , ఎంఎస్పీ, అనుబంధ సంఘాల పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ.. బీజేపీ గెలుపునకు ఎమ్మార్పీఎస్ మద్దతు ఇవ్వడం శుభపరిణామన్నారు. అనంతరం పార్లమెంట్ నియోజకవర్గస్థాయి కమిటీని నియమించారు. కన్వీనర్‌గా గుగ్గిళ్ల పీరయ్య, కోకన్వీనర్లుగా ఇరుగు పైడి, కల్లెపల్లి ప్రణయ్, కమిటీ సభ్యులుగా శ్యాం, ఎల్లయ్య, విజయ్, రమణయ్య, వసంతరావు, రజియా, రేణుక రాజు, వెంకన్నలను నియమించారు.

సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నూనావత్ రాధ

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో ప్రజల్లో ధైర్యం వచ్చిందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేడు తుక్కుగూడలో జరగనున్న సోనియాగాంధీ భారీ బహిరంగ సభకు మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంటు అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్ ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇంటింటికి బొట్టు కార్యక్రమం పేరుతో ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మహిళా నాయకులు బాతుక స్వర్ణలత, నారోజు సత్యమనోరమ, రాజమణి, నిర్మలరెడ్డి, సరస్వతి, కవిత, కళావతి పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంపై పాట చిత్రీకరణ


చిత్రీకరణలో కళాకారులు

నెహ్రూసెంటర్: తెలంగాణ పోరాటం, మూడు తరాల ఉద్యమంపై సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి రాసిన పాటపై సీపీఐ జిల్లా కార్యాలయంలో పాట చిత్రీకరణ శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని బయ్యారం, కంబాలపల్లి, మానుకోట జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో ఉద్యమ తీరును తరలిపించేలా పాటను రూపొందిస్తున్నట్లు అజయ్‌సారథిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి, కొరియోగ్రాఫర్ కందుకూరి అనిల్, కళాకారులు బండ వెంకన్న, కట్లోజు పాండురంగాచారి, చారి, కేదాసు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

21 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

కురవి: అక్రమంగా నిల్వ చేసిన 21 క్వింటాళ్ల నల్లబెల్లం, 2 క్వింటాళ్ల పటికను శుక్రవారం పట్టుకున్నట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా సీరోలు మండలం తాళ్లసంకీస శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ముళ్ల పొదల్లో 21 క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల పటికను అక్రమంగా నిల్వ చేసి తరలించేందుకు ఉంచిన వాటిని పట్టుకున్నట్లు తెలిపారు. కురవి శివారు రేకుల తండాకు చెందిన బానోత్ అశోక్, ఉప్పరిగూడెం శివారు గోప తండా జీపీ శివారు హట్య తండాకు చెందిన బానోత్ భద్రులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన వివరించారు.